RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

| తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | బుధవారం | 21 -02 - 2024 |
|---|---|---|---|
| సంపుటి: 1 | సంచిక : 275 | పేజీలు : 4 | వెల : 5/- |

## మార్చి 9 తర్వాత లోక్‌సభ ఎన్నికలు



3లో

# టచ్‌లు.. స్కెచ్‌లు!



- ప్రధాన పార్టీల మధ్య భారీ పొలిటికల్ డ్రామా!
- ప్రభుత్వం మూన్నాళ్లేనని బీఆర్ఎస్ సంకేతాలు
- గులాబీలు తమవైపు చూస్తున్నారంటున్న బీజేపీ
- అధికార పార్టీలో చేరుతున్న ప్రతిపక్ష నేతలు
- అంతుచిక్కని వ్యూహాల్లో తెలంగాణ రాజకీయాలు

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : తెలంగాణలో రాజకీయ పరిణామాలు మారుతున్నాయా.. త్వరలో ప్రభుత్వం పడిపోతుందా.. కొత్తగా ఏ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. త్వరలో మనమే వస్తాం అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పిన మాటలు నిజవ-ఎవుతాయా.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని బీజేపీ జాతీయ కార్యదర్శి బండి సంజయ్, బీజేపీ బీసీమోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ చేసిన ప్రకటనల్లో ఎంత నిజముంది.. అంటే అన్నింటికీ అవుననే సమాధానం వస్తోంది విశ్లేషకుల నుంచి. ఇప్పుడు ఎంఐఎం మినహా.. మిగతా మూడు ప్రధాన పార్టీల్లో కోవర్టు ఆపరేషన్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఏ క్షణంలో ఏం జరుగుతుందో కూడా అర్థం కావడం లేదు. తెలంగాణలో అన్నీ కుదిరితే త్వరలో ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు బీజేపీ బిగ్ ప్లాన్ రెడీ చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కాంగ్రెస్ తెలంగాణలో అధికారంలో ఉంది. ఆ పార్టీకి 64 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. సీపీఐ ఎమ్మెల్యే కాంగ్రెస్‌కు మద్దతు

మిగతా 2వ పేజీలో...



# కాంగ్రెస్‌లో ఖమ్మం కుంపటి!

- ఎంపీ టిక్కెట్టు కోసం కాంగ్రెస్‌లో పోటాపోటీ
- ఒకరు భార్య కోసం, మరొకరు బ్రదర్ కోసం
- ఆశావహుల మధ్య యుద్ధ వాతావరణం
- అధిష్టానం నిర్ణయంపై ఉత్కంఠభరితం




3లో



# ఏకగ్రీవం!

- రాజస్తాన్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన సోనియా గాంధీ
- తొలిసారి పెద్దలసభకు కాంగ్రెస్ అగ్రనేత
- తెలంగాణలోనూ మూడు స్థానాలు ఏకగ్రీవం
- కాంగ్రెస్ నుంచి రేణుకా, అనిల్‌కుమార్ ఎన్నిక
- బీఆర్ఎస్ నుంచి వద్దిరాజు రవిచంద్రకు దక్కిన ఛాన్స్

3లో



# అన్నీ లోకసభ స్థానాలే లక్ష్యం

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : తెలంగాణలో బీజేపీ విజయ సంకల్ప యాత్రలు చేపట్టింది. ఇందులో భాగంగా తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కృష్ణమ్మ యాత్రను మక్తల్‌కృష్ణ గ్రామంలో కేంద్రమంత్రి పురుషోత్తం రూపాలతో కలిసి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013లో ఇదే కృష్ణా నుంచి తెలంగాణ పోరు యాత్ర ప్రారంభించామని తెలిపారు. ఆ తర్వాత కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ తెచ్చామని చెప్పారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ అన్ని పార్లమెంట్ స్థానాలు బీజేపీ గెలవాలి అని శపథం చేస్తూ మళ్లీ ఇక్కడి నుంచే విజయ సంకల్ప యాత్ర చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో పది సంవత్సరాలుగా అధికారంలో ఉన్న గత ప్రభుత్వం పేదవారికి ఇల్లు కట్టించలేకపోయిందన్నారు. కానీ దేశంలో ఎన్నోకోట్ల

మిగతా 2వ పేజీలో...



# తెలంగాణ రోడ్ల ముచ్చట!

### కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో సీఎం రేవంత్ భేటీ

న్యూఢిల్లీ - ప్రభాతసూర్యుడు : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిమంగళవారం నాడు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తో భేటీ అయ్యారు. తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదారులు అభివృద్ధి, రాష్ట్రీయ రహదారులను జాతీయ రహదారులుగా గుర్తింపు సహా పలు కీలక అంశాలపై చర్చ జరిపారు. తెలంగాణ లోని 15 రాష్ట్రీయ రహదారులను జాతీయ రహదారులుగా అప్ గ్రేడ్ చేయాలని విజ్ఞప్తి చేసారు. హైదరాబాద్ శ్రీశైలం ఫోర్ లైన్ ఎలివేటెడ్ కారిడార్, హైదరాబాదు కల్వకుర్తి రహదారి నీ నాలుగు వరుసల గా అభివృద్ధి చేయడం, రీజినల్

మిగతా 2వ పేజీలో...



# భక్తులతో రద్దీగా మేడారం

### నేడు జాతర ఆరంభం.. కన్నెపల్లి దేవత సారలమ్మ ఆగమనం..

వరంగల్, ప్రభాతసూర్యుడు : ఆసియాలోనే అతిపెద్ద జాతరగా పేరుగాంచిన ఈ సమ్మక్క-సారలమ్మ జాతరకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తుండటంతో రాష్ట్రం ప్రభుత్వం రూ.105 కోట్లు సాంక్షన్ చేసి, వివిధ పనులు చేపడుతుండగా.. తాజాగా కేంద్ర ప్రభుత్వం కూడా రూ.3 కోట్లు కేటాయించింది. దీంతో ఓ వైపు పనులు చేస్తూనే మరో వైపు జాతర నిర్వహణకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. మేడారం మహాజాతరకు ముందస్తు మొక్కులు సమర్పించే భక్తుల తాకిడి ఎక్కువైంది. సాధారణ రోజుల్లోనే నిత్యం వేలాది మంది మొక్కులు సమర్పిస్తుండగా ఇక సెలవు దినాల్లో జాతరకు తరలివస్తున్న వారిసంఖ్య నాలుగైదు రెట్లు ఎక్కువగా ఉంటోంది. వారాంతపు సెలవుల్లో కుటుంబ సభ్యులు, పిల్లాపాపలతో తరలివచ్చి అమ్మవార్ల గద్దెలను దర్శించుకునే భక్తుల సంఖ్య పెరిగిపోవడంతో అక్కడి ప్రాంగణమంతా ఇసుకేస్తే రాలని చందంగా తయారవుతోంది.మేడారంలో ముందస్తు మొక్కులు పెట్టే భక్తుల సంఖ్య పెరిగిపోతుండటంతో టీఎస్ ఆర్టీసీ కూడా జాతరకు కొద్దిరోజుల ముందు నుంచే హనుమకొండ

మిగతా 2వ పేజీలో...



# పని చేస్తానో లేదో అనుకున్నారు..

- గవర్నర్ తమిళిసై సంచలన వ్యాఖ్యలు
- గవర్నర్ సోషల్‌మీడియా ఎక్స్ హ్యాక్!

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : ఐఐటీ హైదరాబాద్ ప్రాజెక్టుని జాతికి అంకితం చేసినందుకు ప్రధాని మోడీకి కృతజ్ఞతలని గవర్నర్ తమిళి సై అన్నారు. మంగళవారం నాడు ఐఐటి లో జరిగిన కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. గవర్నర్ మాట్లాడుతూ తెలంగాణ

మిగతా 3వ పేజీలో...



# భాగ్యనగరం

### హాట్‌హాట్‌గా కౌన్సిల్ మీటింగ్

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : అసెంబ్లీ సమావేశాలకు ఏ మాత్రం తీసిపోని విధంగా జరిగింది జీహెచ్ఎంసీ కౌన్సిల్ మీటింగ్. కొందరు సభ్యులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయగా.. బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం కాసేపు నడిచింది. రెండో రోజు కౌన్సిల్‌లో బడ్జెట్‌పై చర్చ హాట్‌హాట్‌గా సాగింది. మంగళవారం ఉదయం మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన బల్దియా సర్వ సభ్య సమావేశం జరిగింది.రాష్ట్రంలో అధికార మార్పిడి తరువాత జరిగిన మొదటి బల్దియా సమావేశం వాడి వేడిగా సాగింది. అన్ని పార్టీల కార్పొరేటర్లు అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ తమ డివిజన్లలోని సమస్యలను మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. కార్యాలయాల్లో కూర్చొని సంతకాలకే పరిమితం కాకుండా క్షేత్ర స్థాయిలో పనులు పర్యవేక్షించాలని బీజేపీ, ఎంఐఎం కార్పొరేటర్లు సూచించారు. వీరికి కాంగ్రెస్, బీఆర్ఎస్ సభ్యులు

మిగతా 3వ పేజీలో...



# తమిళ సర్కారుకు జయమ్మ సొమ్ములు!

### కర్ణాటక కోర్టు కీలక తీర్పు

3లో



# కుటుంబ పాలనపై ప్రధాని ఫైర్

### యువతకు ఎక్కువ నష్టమని వ్యాఖ్యలు

2లో

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# యాచారం సీఐకి 'వరికుప్పల' సన్మానం




**యాచారం - ప్రభాత సూర్యుడు :** యాచారం మండల నూతన సిఐగా బాధ్యతలు చేపట్టిన శంకర్ కుమార్‌ని కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి వరికుప్పల సుధాకర్ ఆధ్వర్యం లో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ దేరంగుల పాండు ,ప్రధానకార్యదర్శి వరికుప్పల. అజయ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా వరికుప్పల సుధాకర్ మాట్లాడుతూ యాచారం మండలం లో శాంతి భద్రతలకు విఘాతము కలుగకుండా బాగా చూడాలని, డ్రగ్స్ గంజాయి లాంటి మరకద్రవ్యాలకు యువత దూరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు.

# కుటుంబ పాలనపై ప్రధాని ఫైర్

- వంశపారంపర్య రాజకీయాల వల్ల ఎక్కువగా నష్టపోయింది యువతనే
- కుటుంబ రాజకీయాలపై మండిపడ్డ మోదీ..
- 32 వేల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించిన ప్రధాని



**జమ్మూ కశ్మీర్ - ప్రభాతసూర్యుడు :** జమ్మూ కశ్మీర్‌లో ఈరోజు 32 వేల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన బహిరంగ సభలో ప్రసంగిస్తూ కుటుంబ రాజకీయాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. జమ్మూ కశ్మీర్ అనేక దశాబ్దాలుగా రాజవంశ రాజకీయాల బాధితురాలిగా ఉందన్నారు. వంశపారంపర్య రాజకీయాలు చేస్తున్న వారు తమ ప్రయోజనాల కోసం మాత్రమే చూసుకున్నారు తప్ప మీ ప్రయోజనాలను పట్టించుకోలేదని పేర్కొ?న్నారు. వంశపారంపర్య రాజకీయాల వల్ల ఎక్కువగా నష్టపోయింది యువతేనని వెల్లడించారు. తమ కుటుంబం గురించి మాత్రమే ఆలోచించే వ్యక్తులు మీ కుటుంబం గురించి చింతించరని చెప్పారు.ఆర్టికల్ 370ని ప్రధాని మోదీ గోడతో పోల్చారు. ఆ గోడను బీజేపీ ప్రభుత్వం తొలగించిందని చెప్పారు. ఇప్పుడు జమ్మూ కాశ్మీర్ సమతుల్య అభివృద్ధి దిశగా కొనసాగుతోందన్నారు. ఈరోజు వందలాది మంది యువతకు ప్రభుత్వ నియామక పత్రాలు అందజేశామని మోదీ గుర్తు చేశారు. ఈ క్రమంలోనే జమ్మూకశ్మీర్ ఈ వంశపారంపర్య రాజకీయాల నుంచి విముక్తి లభిస్తుందన్న సంతృప్తి ఉందన్నారు.జమ్మూకశ్మీర్ కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళవారం భారీ కానుకలు అందించారు. సంగల్దాన్ స్టేషన్-బారాముల్లా స్టేషన్ మధ్య మొదటి ఎలక్ట్రిక్ రైలును ప్రధాని ప్రారంభించారు. బనిహాల్-ఖరీ-సుంబాద్-సంగల్దాన్ (48 కి.మీ) కొత్తగా విద్యుద్దీకరించబడిన బారాముల్లా-శ్రీనగర్-బనిహాల్-సంగల్దాన్ సెక్షన్ (185.66 కి.మీ) మధ్య కొత్త రైలు మార్గంతో సహా జమ్మూ, కాశ్మీర్‌లో వివిధ రైల్వే ప్రాజెక్టులను మోదీ ప్రారంభించారు.ఎంఏ స్టేడియంలో పదేళ్ల క్రితం డిసెంబర్ 2013లో జమ్మూలోని ఇదే స్థలంలో లాల్కర్ ర్యాలీని ఉద్దేశించి ఇచ్చిన హామీలను గుర్తు చేశారు. జమ్మూలో కూడా ఐఐటీ, ఐఐఎం వంటి విద్యాసంస్థలు ఎందుకు నిర్మించలేరని అప్పుడు ప్రశ్నించామని...ఇప్పుడు ఆ హామీలను నెరవేర్చామని స్పష్టం చేశారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే వంతెనను ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో నిర్మించామని చెప్పారు. జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్రానికి చెందిన రెండు ఎయిమ్స్, ఐఐటి, ఐఐఎంలు వచ్చాయి. జమ్మూ కాశ్మీర్‌లో సామాజిక న్యాయం కొత్త అధ్యాయం ప్రారంభమైంది. గుజ్జర్లు, పహారీలు, ఎస్టీలు, ఎస్సీలు, కాశ్మీరీ పండిట్లు, పశ్చిమ పాకిస్తాన్ నుంచి వచ్చిన శరణార్థులు రాష్ట్రంలో తమ హక్కులను పొందారని గుర్తు చేశారు.

# ఆర్‌ఎంపీ, పీఎంపీల ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం సీఐకి సన్మానం



**ఇబ్రహీంపట్నం -ప్రభాత సూర్యుడు :** ఇబ్రహీంపట్నం మండల నూతన సిఐగా భాద్యతలు స్వీకరించిన సైదిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎంపి, పిఎంపీల రాష్ట్ర అధ్యక్షులు ఉక్కుల అశోక్ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలకు ఇబ్బందులు కలగకుండా అదేవిధంగా డ్రగ్స్, గంజాయి లాంటి మాధకద్రవ్యాలను యువత దూరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీవీరా హాస్పిటల్స్ చైర్మన్ వీరబాబు,మేనేజింగ్ డైరెక్టర్లు డా.ఉపేందర్ గౌడ్, డా.నాగబాబు, రాష్ట్ర కార్యదర్శి డా.మోహన చారి తదితరులు పాల్గొన్నారు.

# అన్నీ లోకసభ స్థానాలే లక్ష్యం



మొదటిపేజీ తరువాయి..

మందికి ప్రధాని మోడీ సొంత ఇళ్లు కట్టించారని తెలిపారు. మన రాష్ట్రంలో చాలా మందికి మోడీ పైసలు, మోడీ బియ్యం వస్తున్నాయని చెప్పారు. తెలంగాణలో జాతీయ రహదారులు తప్పా.. మిగతా రోడ్లు లేవని అన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం కాయా, పీయా చలేగాయా అన్నట్లు వ్యవహరించిందని దుయ్యబట్టారు. గత ప్రభుత్వం దొరికింది మింగారు.. ఇప్పుడు వచ్చిన ప్రభుత్వం ఏది దొరుకుతుంది మింగుదం అని చూస-్తున్నారని విమర్శించారు. తెలంగాణలో అక్రమంగా సంపాదించి.. పార్లమెంట్ ఎన్నికల్లో ఖర్చు పెట్టాలని రాహుల్ గాంధీ చూస్తున్నారని తెలిపారు. తెలంగాణలో కుటుంబ పాలనను ఇంటికి పంపితే.. రాహుల్ గాంధీ దోచుకోవాలని చూస్తున్నారని అన్నారు.కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాలా మాట్లాడుతూ.. కేంద్రంలో మోడీ అధికారంలో లేకుంటే చాలా ఇబ్బందులు ఉండేవని అన్నారు. 500 సంవత్సరాలుగా పోరాడుతున్న రాముని గుడిని అయోధ్యలో కట్టుకున్నాం.. అయోధ్యలో రామ మందిర్ నిర్మాణం బీజేపీ, మోడీ వల్లే జరిగిందని అన్నారు. తెలంగాణలో కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో విజయ సంకల్ప యాత్రలు జరుగుతున్నాయని.. తెలంగాణలో అన్ని పార్లమెంట్ సీట్లపై కాషాయ జెండా ఎగరాలని పు-రుషోత్తం రూపాలా తెలిపారు.

# ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్, ఎంపీడీవోకు సన్మానం





**యాచారం - ప్రభాత సూర్యుడు :** యాచారం మండలానికి నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ అయ్యప్ప,డిప్యూటి తహసిల్దార్ కీర్తి సాగర్,ఎంపిడిఓ నరెందర్ రెడ్డి ని కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ యాచారం మండల కేంద్రములో ప్రభుత్వ హాస్పిటల్ దగ్గర ఉన్న ఎస్సిల దుకాణ సముదాయాలను మ-రమత్తులు చేసి వాటిని ఉపయోగపడేలా చేయాల్సిందిగా ఎంపీడీవోను కోరారు. అదేవిధంగా యాచారం మండలంలో పలు గ్రామాలలో భూపరమైన సమస్యలు ఉంటే వెంటనే స్పందించి సమస్యలు పరిష్కారం చేయాలని ఎమ్మార్వో కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పిఎస్ నాయకులు బోడ క్రిష్ణ, వి హెచ్ పి ఏస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాళ్ళ జంగయ్య ఎమ్మార్పిఎస్ సీనియర్ నాయకులు చింతుల్ల సాయిలు,జోగు అంజయ్య,కంబాలపల్లి సాయిలు,ఎమ్మార్పిఎస్ మండల అధ్యక్షులు మూలి మహేష్ పాల్గొన్నారు.

# భక్తులతో రద్దీగా మేడారం

మొదటిపేజీ తరువాయి..

బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సులు కూడా నడిపిస్తోంది. దీంతో వనదేవతల దర్శనానికి వచ్చే జనాల సంఖ్య చాలా ఎక్కువగా ఉంటోంది.ఆదివారం మేడారంలో ఫుల్ రష్ కనిపించింది. తెల్లవారుజాము నుంచే మేడారం జాతరలో భక్తులు దర్శనానికి క్యూ కట్టగా.. ఈ ఒక్కరోజే సుమారు ఐదు లక్షల మంది వరకు భక్తులు మొక్కులు సమర్పించి ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఇలా ప్రతి ఆదివారం, ఇతర సెలవు దినాల్లో కలిపి ఇప్పటికే ఏంతక్కువ 20 లక్షల మందికిపైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ఉంటారని అంచనా వేస్తున్నారు.మేడారం మహాజాతర నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం టీఎస్ ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. జాతరకు జనాలను తరలించడంలో ఆర్టీసీదే కీలక పాత్ర కాగా.. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 51 ఆపరేటింగ్ పాయింట్ల నుంచి ఆరు వేలకు పైగా బస్సులు నడిపిస్తోంది.ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచే దాదాపు సగం బస్సులు నడుస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో వరంగల్ ట్రై సిటీ కీలకం కాగా.. వరంగల్, హనుమకొండ, కాజీపేట పరిధిలో ఏర్పాటు చేసిన మూడు ఆపరేటింగ్ పాయింట్ల ద్వారా దాదాపు వెయ్యి బస్సులకుపైగా నడిపించే అవకాశం ఉంది.కేవలం ఈ మూడు పాయింట్ల నంచే సుమారు పది లక్షల మందిని తరలించే అవకాశం ఉందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం ఉదయం నుంచి మేడారం స్పెషల్ బస్సులను ఆర్టీసీ అధికారులు ప్రారంభించారు. ఇప్పటికే ప్రతి బుధ, ఆదివారాల్లో హనుమకొండ బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తుండగా.. మేడారంలో ఆర్టీసీ సౌకర్యార్థం 55 ఎకరాల విస్తీర్ణంలో తాత్కాలిక బస్టాండ్ ఏర్పాటు చేశారు.మొత్తం 15 కిలోమీటర్ల పొడవు ఉండే 48 క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఈసారి మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా సుమారు 30 లక్షల మందైనా ఆర్టీసీ సేవలను వినియోగించుకునే అవకాశం ఉందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు.





# టచ్‌లు.. స్కెచ్‌లు!

మొదటిపేజీ తరువాయి..

ఇస్తున్నారు. అయితే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ నుంచి 56 మంది, బీఆర్ఎస్ నుంచి 12 మంది ఎమ్మెల్యేలు బీజేపీలో చేరతారని తెలుస్తోంది.బీజేపీ గీస్తున్న స్కెచ్ అమలు చేస్తే.. అత్యధిక మెజారిటీతో తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పాడుతుంది. కాంగ్రెస్‌కు చెందిన 56 మంది, బీఆర్ఎస్‌కు చెందిన 12 మంది, బీజేపీకి చెందిన 8 మంది కలిపి మొత్తం 80 మంది ఎమ్మెల్యే బలంలో బీజేపీ సర్కార్ ఏర్పాటవుతుంది. ఈమేరకు లోక్‌సభ ఎన్నికల తర్వాత తెలంగాణలో కొత్త రాజకీయ క్రీడ మొదలవుతుందని అంచనా వేస్తున్నారు.ఇక అధికార కాంగ్రెస్ విషయానికి వస్తే 56 మంది బయటకు వస్తారని లెక్కలు వేస్తున్నారు. ఇంతమంది బయటకు రావడం జరుగుతుందా.. కుదిరే పనేనా అన్న సందేహాలు వ్యక్తవ-ువుతున్నాయి. అంతమంది బయటకు వస్తే.. కాంగ్రెస్‌ను చీల్చే నాయకుడు ఉండాలి. మహారాష్ట్రలో ఏక్‌నాథ్ షిండే శివసేనను చీల్చిన విధంగా తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్‌ను కూల్చాలంటే అందులో మరో ఏక్‌నాథ్ షిండేలాంటి నేత కావాలి. అలా అయితేనే 56 మంది ఎమ్మెల్యేలను బయటకు తీసుకురాగలుగుతారు. ఇక ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్‌లో ఏక్‌నాథ్ షిండే ఎవరు అన్న చర్చ రాజకీయవర్గాల్లో జరుగుతోంది. ప్రస్తుతం అంతా ఐక్యంగా ఉన్నట్లు కనిపిస్తోంది. కానీ, ఇది తుఫాను ముందటి ప్రశాంతతా అన్న చర్చ కూడా జరుగుతోంది. కాంగ్రెస్ అంటేనే కయ్యాలు.. అసంతృప్తులు. దీనినే బీజేపీ తనకు బలంగా మార్చుకుంటుందని తెలుస్తోంది. ఇక బీఆర్ఎస్‌లో ఉన్న ఎమ్మెల్యేలు పార్టీ మారేందుకు రెడీగా ఉన్నారు. ఎప్పుడు కుదిరితే అప్పుడు పార్టీకి గుడ్‌బై చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు. అయితే రాజకీయ పరిణామాలను జాగ్రత్తగా గమనిస్తూ నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారు

# తెలంగాణ రోడ్ల ముచ్చట!

మొదటిపేజీ తరువాయి..

రింగ్ రోడ్డు దక్షిణ భాగం అభివృద్ధి, హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిని ఆరువరుసల విస్తరించడంపై గడ్కరీ తో రేవంత్ రెడ్డి , మల్లు భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి చర్చ జరిపారు. సీఆర్ఐఎఫ్ నుండి తెలంగాణ కు నిధుల కేటాయింపు పెంచాలనీ విజ్ఞప్తి చేసారు. నల్గొండలో ట్రాన్స్పోర్ట్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ఏర్పాటు చేయాలని,నల్గొండ పట్టణానికి బైపాస్ రోడ్డు మంజూరు చేయాలని నితిన్ గడ్కరీ కి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రత్యేక విజ్ఞప్తి చేసారు.



RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com




## మార్చి 9 తర్వాత లోక్‌సభ ఎన్నికలు

**న్యూఢిల్లీ, ప్రభాతసూర్యుడు :** లోక్‌సభ ఎన్నికలకు సమయం దగ్గరపడుతుండటంతో కేంద్ర ఎన్నికల సంఘం సమాయత్తమైంది. ఈ మేరకు ఎన్నికల నిర్వహణపై ఇప్పటికే కసరత్తు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. వచ్చే నెల ఈసీ సార్వత్రిక ఎన్నికల నగారా మోగించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం. మార్చి 9 తర్వాత లోక్‌సభ ఎన్నికల తేదీలను ఈసీ ప్రకటించే అవకాశం ఉందని జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి.కాగా, పార్లమెంట్ ఎన్నికలతో పాటు పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను కూడా నిర్వహించేందుకు ఈసీ ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికలతోపాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీలకు ఈ ఏడాది మేలోగా ఎన్నికలు జరగాల్సి ఉంది. ఇందులో భాగంగానే ఈసీ బృందం గత కొన్ని రోజులుగా వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తోంది. రాజకీయ పార్టీలు, స్థానిక అధికారులతో సమావేశాలు నిర్వహించిన అధికారులు షెడ్యూల్‌ను కూడా సిద్ధం చేసినట్లు సమాచారం.వీటితోపాటు జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలను కూడా నిర్వహించాలని ఈసీ భావిస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ అధికారులతో మార్చి 8, 9 తేదీల్లో ఈసీ భేటీ కానున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సంసిద్ధతను పరిశీలించేందుకు మార్చి 12,13 తేదీల్లో జమ్మూకశ్మీర్‌లో పర్యటించనున్నట్లు సమాచారం. లోక్‌సభతో పాటే అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించే అవకాశాలపై ఒక అంచనాకు రానున్నట్లు తెలుస్తోంది. గతంలోలానే ఈ సారి కూడా ఏప్రిల్ ? మే నెలల్లోనే సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేలా ఈసీ ఏర్పాట్లు చేస్తోంది. గత లోక్‌సభ ఎన్నికలకు 2019 మార్చి 10న షెడ్యూల్ ప్రకటించారు. ఏప్రిల్ 11 నుంచి మే 19వ తేదీ వరకూ ఏడు దశల్లో పోలింగ్ జరిగింది. మే 23న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించారు.

## మూసీ అభివృద్ధిపై సీఎం రేవంత్ సమీక్ష

**హైదరాబాద్ -ప్రభాతసూర్యుడు :** మూసీ నదీ పరివాహక అభివృద్ధిపై నానక్ రామ్ గూడ హెచ్ఎండీఏ కార్యాలయంలో అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. మూసీ రివర్ బౌండరీస్ లొకేషన్ స్కెచ్ తో పాటు పలు వివరాలను సీఎం కు అధికారులు వివరించారు. మూసీ అభివృద్ధి ప్రక్రియ వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు కసరత్తు పూర్తి చేయాలని ఆదేశం ఇచ్చారు. ఇందుకు ముందుగా మూసీ క్లీనింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నగరంలోని చారిత్రక కట్టడాలను కలుపుతూ ఉండేలా మూసీ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలన్నారు.





# కాంగ్రెస్‌లో ఖమ్మం కుంపటి!

- ఎంపీ టిక్కెట్లు కోసం కాంగ్రెస్‌లో పోటాపోటీ
- ఒకరు భార్య కోసం, మరొకరు బ్రదర్ కోసం
- ఆశావహుల మధ్య యుద్ధ వాతావరణం
- అధిష్టానం నిర్ణయంపై ఉత్కంఠభరితం




**ఖమ్మం, ప్రభాతసూర్యుడు :** ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ టిక్కెట్ కోసం భారీ పోటీ నెలకొంది. మొదట సోనియా గాంధీ పోటీ చేస్తారని అనుకున్నారు. కానీ ఆమె రాజస్థాన్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఇక రేసులో గట్టి పోటీ ఇస్తారనుకున్న రేణుకా చౌదరి కూడా తెలంగాణ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. దీంతో ఇప్పుడు పోటీ అంతా పొంగులేటి ప్రసాద్ రెడ్డి, మల్లు నందిని మధ్య ఉంది. వీరిద్దరి కోసం ఇద్దరు మంత్రులు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఖమ్మం పార్లమెంట్ సీటుపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్నట్లు కాంగ్రెస్ పార్టీలో గుసగసలు వినిపిస్తున్నాయి. ఇందుకు కారణం ఖమ్మం ఎంపీ సీటు రేసులో భట్టి సతీమణి మల్లు నందినితో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోదరుడు ప్రసాద్ రెడ్డి ఉన్నారు. వీరిద్దరూ హైకమాండ్ వద్ద గట్టి ప్రయత్నాలు చేసుకుంటున్నారు. సోషల్ మీడియాలో పోటాపోటీగా తమకే ఎంపీ టికెట్ వస్తుందని ప్రచారాలు చేసుకుంటున్నారు తే కాంగ్రెస్ హైకమాండ్ ఖమ్మం సీటు ఎవరకి ఇస్తుందనే దానిపై ఉత్కంఠ రాష్ట్ర రాజకీయాల్లో నెలకొంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడి ఏడు సెగ్మెంట్లనూ కాంగ్రెస్, సీపీఐ గెల్చుకున్నాయి. కొత్తగూడెం నుంచి సీపీఐ గెలవగా.. మిగతా ఆరు చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులు భారీ మెజార్టీ సాధించారు. మొదటి నుంచీ కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న ఖమ్మం నుంచి ఇప్పటివరకు 11 సార్లు కాంగ్రెస్ విజయం సాధించింది. సీపీఎం రెండు సార్లు, పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్, తెలుగుదేశం పార్టీ, వైసీపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు ఒక్కోసారి మాత్రమే గెలుపొందారు. రెండు దఫాలు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ 2019 ఎన్నికల్లో మాత్రమే ఇక్కడ బోణీ కొట్టింది. కానీ మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయంతో ఖమ్మంను తమ ఖాతాలో వేసుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. అన్ని సెగ్మెంట్లలో కలిపి రెండున్నర లక్షలకుపైగా మెజార్టీ కాంగ్రెస్ కు రావడంతో .. ఎవరు గెలిచినా విజయం ఖాయమని అనుకుంటున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొంత బలంగా ఉన్న కమ్యూనిస్టు పార్టీల ఎన్నికల వ్యూహాలపై ఇంకా క్లారిటీ రాలేదు. గత ఎన్నికలకు ముందు పొత్తు కుదరడంతో సీపీఐ, కాంగ్రెస్ కలిసి పోటీచేశాయి. పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఈ రెండు కలిసే పోటీ చేయనున్నాయి. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో విడిగా పోటీచేసిన సీపీఎం మాత్రం, ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్న దృష్ట్యా పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ తో కలిసి ఉండే అవకాశముంది. ఇండియా కూటమిలో భాగంగా తమకు ఒక్క చోట అయినా పోటీ చేసే అవకాశం ఇవ్వాలని కమ్యూనిస్టులు కోరుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క స్థానానికే పరిమితం చేసినా అంగీకరించామని గుర్తు చేస్తున్నారు. మొత్తంగా ఖమ్మం సీటు కోసం.. ఓ రేంజ్ యుద్ధం కాంగ్రెస్ పార్టీలో జరిగే అవకాశం కనిపిస్తోంది.



## ఏకగ్రీవం!

- రాజస్తాన్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన సోనియా గాంధీ
- తొలిసారి పెద్దలసభకు కాంగ్రెస్ అగ్రనేత
- తెలంగాణలోనూ మూడు స్థానాలు ఏకగ్రీవం
- కాంగ్రెస్ నుంచి రేణుకా, అనిల్‌కుమార్ ఎన్నిక
- బీఆర్ఎస్ నుంచి వద్దిరాజు రవిచంద్రకు దక్కిన ఛాన్స్

**న్యూఢిల్లీ - ప్రభాతసూర్యుడు :** కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ రాజస్థాన్ నుంచి రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోనియాగాంధీతో పాటు బీజేపీ నేతలు చున్నీలాల్ గారసియా, మదన్ రాథోడ్‌లు రాజస్థాన్ నుంచి ఎగువ సభకు ఎన్నికైనట్టు అసెంబ్లీ సెక్రటరీ మహావీర్ ప్రసాద్ శర్మ తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు మంగళవారంతో ముగిసింది. పోటీలో ఇతర అభ్యర్థులు ఎవరూ లేకపోవడంతో ఈ ముగ్గురు నేతలు పోటీలేకుండానే ఏకగ్రీవంగా పెద్దలసభకు ఎన్నికయ్యారు.

**తెలంగాణలో మూడు సీట్లు...**

తెలంగాణ లో రాజ్యసభ ఎన్నికల్లో ముగ్గురు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీ నుండి రేణుకా చౌదరి, అనీల్ కూమార్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నిక కాగా బిఆర్ఎస్ పార్టీ నుండీ వద్దిరాజు రవి చంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం వద్దిరాజు రిటర్నింగ్ అధికారి నుండీ ధృవీకరణ పత్రం అందుకున్నారు.

## 24న షర్మిల కుమారుడి రిసెప్షన్



**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :** ఈనెల 24న హైజదరాబాద్ లోని శంషాబాద్ లో వివాహ రిసెప్షన్ కు షర్మిల ఏర్పాట్లు చేశారు. రాజకీయ, సినీ ప్రముఖులందరికీ ఆహ్వానాలు అందాయి. తెలుగుదేశం అధినేత చంద్రబాబు ఈ వేడుకలకు హాజరుకానున్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సైతం రానున్నారు. అయితే షర్మిల సొంత అన్న ఏపీ సీఎం జగన్ వస్తారా లేదా అన్నది ఇంకా కన్ఫార్మ్ కాలేదు. జోధ్‌పూర్ లోజరిగిన వివాహ వేడుకలకు కూడా ఆయన హాజరుకాలేదు. ఇటీవల హైదరాబాద్ లో జరిగిన నిశ్చయ తాంబూలాల వేడుకకు మాత్రమే హాజరయ్యారు. ఇప్పుడు రిసెప్షన్ కు వస్తారో లేదో వేచిచూడాలి.

## జయలలిత సొమ్ములను తమిళ సర్కారుకు అప్పగించాలి

**కర్ణాటక కోర్టు కీలక తీర్పు**

**బెంగళూరు - ప్రభాతసూర్యుడు :** కర్ణాటకలోని బెంగళూరు కోర్టు కీలక తీర్పు వెలువరించింది. తమిళనాడు దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత కు సంబంధించిన బంగారు ఆభరణాలను ఆ రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆభరణాల అప్పగింతకు మార్చి 6, 7 తేదీలను ఖరారు చేసింది. ఆ రెండు రోజుల్లో ఆభరణాలను తీసుకెళ్లేందుకు ఆరు ట్రంకు పెట్టెలతో రావాలని తమిళనాడు ప్రభుత్వాన్ని బెంగళూరులోని ప్రత్యేక కోర్టు ఆదేశించింది. మొత్తం 27 కేజీల బంగారు, వజ్రాభరణాలతో పాటు, 700 కేజీలకుపైనే వెండిని ప్రభుత్వానికి అప్పగించనుంది.బంగారు ఆభరణాలు తీసుకోవడానికి ఒక అధికారిని నియమించినట్లు న్యాయస్థానం తెలిపింది. తమిళనాడు హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఐజీపీ ఆ అధికారితో సమన్వయం చేసుకోవాలని సూచించింది. కోర్టు నుంచి ఆభరణాలను స్వాధీనం చేసుకునే సమయంలో ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్, ఆరు పెద్ద ట్రంకు పెట్టెలు, అవసరమై భద్రత సిబ్బందితో రావాలని ఆదేశించింది. నగలను తమిళనాడు రాష్ట్రానికి అప్పగించేందుకు ఆ రెండు రోజుల్లో స్థానిక పోలీసులతో అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. అదేవిధంగా.. ఈ కేసులో తమిళనాడు ప్రభుత్వం.. కర్ణాటకకు లిటిగేషన్ ఫీజుగా రూ.5 కోట్లు చెల్లించాలని ఆదేశించింది.తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలిత అటు రాజకీయాల్లోనూ, ఇటు సినిమాల్లో తనదైన ముద్ర వేసింది. తమిళనాడు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఈమెకు లెక్కకు మించి ఆస్తులున్నాయనే విషయం అందరికీ తెలిసిందే. రాష్ట్ర సీఎంగా ఉన్న సమయంలో అక్రమార్జన కేసులో 1996లో చెన్నైలోని జయ నివాసం నుంచి అధికారులు పలు వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత అక్రమ కేసులో జయ దోషిగా



తేలడంతో 2014లో బెంగళూరు కోర్టు నాలుగేళ్లు జైల, రూ.100 కోట్లు జరిమానా విధించింది. అలాగే స్వాధీనం చేసు కున్న వస్తువులను ఆర్బీఐ, ఎస్బీఐ లేదా బహిరంగ వేలం ద్వారా విక్రయించాలని స్పష్టం చేసింది. అయితే ఇంతలోనే జయలలిత మరణించారు. ఈ క్రమంలోనే దీనిపై మరోసారి విచారణ జరిపిన ప్రత్యేక కోర్టు ఆ ఆభరణాలను తమిళనాడు ప్రభుత్వానికి బదిలీ చేయాలని నిర్ణయించింది. జయలలిత చరాస్తులు, స్థిరాస్తులను వేలం వేయడమే ప్రత్యేక కోర్టు ప్రస్తుత విచారణలో ఉంది.ఆభరణాలను వేలం వేసిన తర్వాత కోర్టు ఆమె స్థిరాస్తులను వేలానికి తీసుకురానుంది.

**కర్ణాటక ప్రభుత్వ ఆధీనంలో ఉన్న వస్తువులు..**

అక్రమార్జన కేసులో 1996లో చెన్నైలోని జయ నివాసం నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలతోపాటు పలు వస్తువులన్నీ కర్ణాటక ప్రభుత్వం ఆధీనంలోనే ఉన్నాయి. అందులో 7 కిలోల బంగారు, వజ్రా భరణాలు, 700 కిలోల వెండి వస్తువులు ఉన్నాయి. ఖరీదైన చెప్పులు, పట్టుచీరలు, వీడియో క్యాసెట్లు, లాకర్లతో పాటు పలు వస్తువులు కూడా ఉన్నాయి. అదేవిధంగా అమ్మకు సంబంధించిన రూ,1.93 లక్షల నగదు కూడా ఉంది. వీటన్నింటినీ తమిళనాడు ప్రభుత్వానికి అప్పగించాలని కర్ణాటకలోని బెంగళూరు కోర్టు తాజాగా నిర్ణయించింది.



## పని చేస్తానో లేదో అనుకున్నారు..

మొదటిపేజీ తరువాయి..

కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రం. నేను తెలంగాణకి గవర్నర్ గా వచ్చినప్పుడు నేను పని చేస్తానో లేదోనని కొంతమంది అనుమానం వ్యక్తం చేశారు. నేను గైనకాలజిస్ట్ ని పిల్లని తల్లి ఎలా చూసుకోవాలో నాకు తెలుసు,
పుదుచ్చేరి రాష్ట్ర బాధ్యతలు కూడా ఇచ్చినప్పుడు కవల పిల్లలు పుడితే ఎలా చుసుకోవాలో డాక్టర్ గా తెలుసు. కరోనా సమయంలో ఐఐటీ హైదరాబాద్ తయారు చేసిన వెంటిలేటర్లు ఎంతోమంది ప్రాణాలు కాపాడాయని అన్నారు.

**గవర్నర్ ఖాతా హ్యాక్...**

గవర్నర్ తమిళి సై 'ఎక్స్' ఖాతా హ్యాక్ విచారణ ముమ్మరం చేశారు పోలీసులు. ముంబై నుంచే గవర్నర్ తమిళి సై 'ఎక్స్' ఖాతా హ్యాక్ అయినట్లు గుర్తించారు. అక్కడి ఓ బొటెక్ వైఫై నెట్‌వర్క్‌ను దుండగుడు వినియోగించినట్లు అధికారులు కనుగొన్నారు. ఈ హ్యాక్ పై సైబర్ క్రైమ్ పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సాంకేతిక ఆధారాల ద్వారా గుర్తించారు. ఆ సంస్థ నిర్వాహకురాలిని ప్రశ్నించినా వివరాలు బయటకు రావడంతో షాక్ తిన్నారు. ప్రత్యామ్నాయ మార్గాల దర్వారా అన్వేషిస్తున్నట్లు సమాచారం. గత కొన్ని రోజులుగా బోటిక్ మూసి వేసినట్లు గమనించారు. అయితే.. గవర్నర్ ఎక్స్ అకౌంట్ ఎందుకు హ్యాక్ చేశారు? పర్యటన వివరాలు తెలుసుకునేందుకు ఇలా చేశారా? లేక ఇంకేమైనా ఇతర కారణాలు ఉన్నాయా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈ నెల 14న తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ చీ ఖాతా హ్యాక్ అయినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో మూడు కొత్త ఎఖ చిరునామాలు గుర్తించారు. సంబంధిత సర్వీస్ ప్రొవైడర్లు ఐపీ అడ్రస్‌ల ద్వారా వివరాలను పంపాలని కోరారు. అందిన సమాచారంతో సైబర్ క్రైమ్ పోలీసులు ముంబై నుంచి అకౌంట్ హ్యాక్ అయినట్లు గుర్తించారు. అయితే.. కంపెనీ రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ అతిక్రమించారంటూ ఎక్స్ కంపెనీ నుంచి గవర్నర్ తమిళ్ సాయికి మెయిల్ వచ్చినట్లు సమాచారం. దీంతో గవర్నర్ తన ఖాతా తెరవడానికి ప్రయత్నించగా పాస్‌వర్డ్ తప్పు వస్తుందని అధికారులు వెల్లడించారు. తమిళిసైకి సంబంధం లేని పోస్టులు ఇచ్చారు. గవర్నర్ తమిళిసై ఆదేశాల మేరకు రాజ్ భవన్ అధికారులు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గవర్నర్ ఖాతాను గుర్తుతెలియని వ్యక్తులు హ్యాక్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తాజాగా వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సోషల్ మీడియా ఖాతాలు హ్యాక్ అయిన సంగతి తెలిసిందే.

## భాగ్యనగరం

మొదటిపేజీ తరువాయి..

కూడా మద్దతు తెలిపారు. వీధి దీపాల విషయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.ఈ సందర్భంగా సభలో కౌన్సిలర్లు ప్రజా సమస్యలను ఎకరువు పెట్టారు. హైదరాబాద్‌లో కుక్కల బెడద తీవ్రంగా ఉందని.. కుక్కలు కరిసి జనాల ప్రాణాలు పోతున్నాయని కార్పొరేటర్లు ముక్తకంఠంతో ఆందోళన వ్యక్తం చేశారు. అయినా పట్టించుకోరా అంటూ అధికారులను కార్పొరేటర్లు నిలదీశారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో స్పోర్ట్స్ తక్కువ, ఫంక్షన్స్ ఎక్కువ అని కార్పొరేటర్లు చెబుతున్నారు..కార్పొరేటర్లను అధికారులు పట్టించుకోవడం లేదంటూ బీజేపీ కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు కార్పొరేటర్లను కుక్కల కన్నా హీనంగా చూస్తున్నారన్నారు. కనీసం అధికారులు తమ ఫోన్లు కూడా ఎత్తడం లేదని కార్పొరేటర్ల ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు తాము ఏమి సమాధానం చెప్పాలని కార్పొరేటర్లు ప్రశ్నించారు. సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నేతల మధ్య వాదనలు జరిగాయి. జీహెచ్ఎంసీలో అన్ని సమస్యలే ఉన్నాయని.. హైదరాబాద్ పరువు పోతుందని బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఆరోపించారు.కాగా.. నిన్నటి కౌన్సిల్ సమావేశం వాడీవేడీగా జరిగిన విషయం తెలిసిందే.



ఈరోజు లంచ్ లోపు గ్రేటర్ హైదరాబాద్ సమస్యలపై చర్చ జరుగనుంది. మధ్యాహ్నం లంచ్ తరువాత 2024 -25 ఆర్థిక సంవత్సరానికి రూ.8,437 కోట్ల జీహెచ్ఎంసీ బడ్జెట్‌ను మేయర్ ప్రవేశపెట్టారు. రూ.7937 కోట్ల సాధారణ బడ్జెట్, రూ.500 కోట్ల డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం బడ్జెట్‌ను రూపొందించారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# జీహెచ్ఎంసీ బడ్జెట్ రూ.8,437 కోట్లు

**2024-25 సంవత్సరపు ప్రతిపాదనలు**

**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :**

: జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం సోమవారం ఉదయం ప్రారంభమైంది. ఈ సందర్భంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను జీహెచ్ఎంసీ బడ్జెట్ రూ.8437 కోట్లుగా ఖరారు చేశారు. అలాగే రెవెన్యూ ఆదాయం రూ.5938 కోట్లు, రెవెన్యూ వ్యయం రూ.3458 కోట్లు, రెవెన్యూ మిగులు రూ.2,480 కోట్లు, కాపిటల్ నిధులు రూ.1,999 కోట్లు, కాపిటల్ వ్యయం రూ. 4,479 కోట్లుగా జీహెచ్ఎంసీ తెలిపింది. అలాగే హౌసింగ్ కోసం ప్రత్యేకంగా రూ.500 కోట్లు కేటాయించినట్లు జీహెచ్ఎంసీ వెల్లడించింది.




# సంపాదకీయమ్..

## కామన్ సివిల్ కోడ్ దిశగా అడుగులు

ఏదిఏమైనా ఉమ్మడి పౌరస్మృతి అనే దానిని మన దేశంలో అమలు చేయాలి అనేది బిజెపి చిరకాల వాంఛ. దానిని సాకరమయ్యే దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. బిజెపి ఎంతో కాలంగా కలలు కంటున్న ముఖ్యమైన లక్ష్యాలను గత పదేళ్ళలో చాలా వరకు నెరవేర్చుకో గలిగింది. ముఖ్యంగా ఇటీవల అయోధ్యలో రామాలయం నిర్మాణం పూర్తికావడంతో బిజెపి మంచి జోరుమీద ఉంది. ఇప్పటికే కశ్మీర్‌కి ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే రాజ్యాంగంలోని 370 అధికరణాన్ని మోడీ ప్రభుత్వం రద్దు చేసి ఘన విజయం సాధించింది. ఇప్పుడు ఉత్తరాఖండ్‌లోని బిజెపి ప్రభుత్వం ఉమ్మడి పౌరస్మృతిని ఆమోదిస్తూ అసెంబ్లీ తీర్మానం చేసింది. ఈ ఉమ్మడి పౌ-రస్మృతిని ఆమోదించిన తొలి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ చరిత్రను సృష్టించింది. ఈ చట్టం ద్వారా స్త్రీ, పురుష భేదం లేకుండా అందరూ సమానులేనని రుజువు చేయడమే ఉమ్మడి పౌరస్మృతి లక్ష్యం అని ప్రకటించింది. మానవ జీవన ప్రయాణంలో కుటుంబ జీవితం ఒక ప్రధాన ఘట్టం. దానిలో వివాహం, విడాకులు, దత్తత మొదలైన పౌరజీవితాన్ని ప్రభావితం చేసే వ్యవహారాలలో ఈ ఉమ్మడి పౌరస్మృతి అనే చట్టం కీలకం కానున్నది. ఇప్పటికే ఈ తరహా చట్టాన్ని అమలు చేసేందుకు అసోం, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ప్రత్యేక ఆసక్తిని చూపిస్తున్నాయి. ఇవి అన్నీ బిజెపి పాలిత రాష్ట్రాలే కావడంతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా బిజెపి ఆధీనం లో ఉంది కనుక దీనిని అమలు చేయడంలో పెద్దగా ఆటంకాలు అంటూ ఏమీ ఎదురుకావు. ఈ చట్టం ప్రకారం సహజీవనం సాగిస్తున్న జంటలుకూడా వెంటనే తమ బంధాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి అనే నిబంధనను ఈ చట్టంలో చేర్చారు. ఒకవేళ ఎవరైనా అలా చేయించుకోకపోతే వారు చట్టం ప్రకారం శిక్షార్హులు అవుతారు. మూడు నెలలపాటు సహజీవనం చేసిన జంట తమ డిక్లరేషన్ తప్పక ఇవ్వాల్సిందే. లేకపోతే వారికి మూడు నెలలు జైలు శిక్షపడుతుంది. ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఆమోదించిన ఈ బిల్లులో గిరిజనులకు మాత్రం మినహాయింపు ఇచ్చారు. ఈ సహజీవనం చేసుకున్న వారికి పుట్టిన పిల్లలకు, వారి సంతనానికి సమాన హక్కులు ఉంటాయి. ఈ చట్టం ద్వారా మహిళలకు రక్షణ లభిస్తుంది. ఇంతకు ముందు 'గోవా' ప్రాంతం పోర్చుగీస్ పాలనలో ఉన్నప్పుడు ఇలాంటి చట్టం అమలు లో ఉండేది. ఈ చట్టం అమలైతే బాల్యవివాహాలు రద్దు అవుతాయి. ఇప్పటికే అరేబియా, ఇండోనేషియా, జర్మనీ, జపాన్, మొదలైన దేశాల్లో కూడా ఇలాంటి చట్టం అమలులో ఉంది. ఈ చట్టం అమలులోకి వచ్చిన తర్వాత మహిళలకు పూర్తి భద్రత లభిస్తుంది.

ముఖ్యంగా సహజీవనం పేరిట జరిగే మోసాలకు పరిష్కారం లభిస్తుంది. పాశ్చాత్య దేశాల ప్రభావంతో వివాహం కాకుండానే కొంతకాలం ఇష్టపూర్వకంగా సహజీవనం చేయడం కలతలు, విభేధాలు రాగానే వెంటనే విడిపోయి, ఎవరికి వారు స్వతంత్రంగా బతకటం మామూలైపోయింది. ఈ నేపథ్యంలో ఎక్కువగా నలిగిపోతున్నది మహిళలు వారికి కలిగిన సంతానం. సమాజపరంగా అనేక అవమానాలను వారు ఎదుర్కొంటున్నారు. ఈ కష్టకాలంలో వారికి ఏ విధమైన చట్టపరమైన రక్షణ గానీ, తమ కుటుంబ బంధుమిత్రుల నుండి ఆదరణగానీ వారికి దొరకటం లేదు. ఇలాంటి సమస్యలతో సతమతమయ్యే మహిళలకు ఈ చట్టం రక్షణ కవచంలా పని చేస్తుంది. అలాగే ముస్లిం సమాజంలో ఉన్న మహిళలు 'త్రిపుల్ తలాక్'తో అనేక వివక్షలను ఎదుర్కొంటున్నారు. అందువల్ల 'త్రిపుల్ తలాక్' చట్టం రద్దు చేయటం ద్వారా మహిళల పట్ల వివక్ష లేకుండాచేశారు. ముస్లిం సంప్రదాయంలో ఇది భాగమంటూ చాలా కాలం దీనిని ఇస్లాం మతపెద్దలు కొందరు, లౌకికవాదుల పేరిట కొందరు చాలా కాలం అడ్డుకున్నారు. అయితే, ఇది పూర్తిగా మతపరమైన సమస్య మాత్రమే కాదు మొత్తంగా ముస్లిం మహిళల అందరి సామాజిక సమస్య.

ఇంతకాలం ఈ 'త్రిపుల్ తలాక్' అనేది పురుషులకు మాత్రమే ప్రయోజనకరంగా ఉండేది. ఎలాంటి లింగ వివక్షత ఉండరాదు అని ఇప్పటికే అనేక మహిళా సంక్షేమ సంఘాలు దశాబ్దాలుగా దేశవిదేశాలలో పోరాటాలు చేశారు. అందుకే ముస్లిం మహిళలకు రక్షణ కల్పించే ఉద్దేశంతోనే 'త్రిపుల్ తలాక్'ను రద్దు చేస్తున్నామని భారత ప్రధాని నరేంద్ర మోడీ పార్లమెంటులో స్పష్టం చేశారు. 'ఉమ్మడి పౌర స్మృతి'ని చాలా కాలం అనేక మంది అనేక కారణాలతో ఆచరణ సాధ్యం కాకుండా అడ్డుకున్నారు. ఇప్పటికీ కొంతమంది అడ్డుకుంటున్నారు కూడా. దీని వల్ల మహిళలు నష్టపోతున్నారు. సమాన అవకాశాలూ, హక్కులను కోల్పోతున్నారు. మహిళలకు ఉద్యోగాల్లో, విశ్వవిద్యాలయాలో, విద్యా సంస్థల్లో ఇప్పటికే సమాన అవకాశాలు లభిస్తున్నాయి. వీటిని ఇంకా విస్తృత పరిచేందుకు 'ఉమ్మడి పౌరస్మృతి' ఎంతో ఉపయోగపడుతుంది. ఉత్తరాఖండ్‌లో 2022 అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ఉమ్మడి పౌరస్మృతిపై ప్రజలకు వాగ్దానం చేసింది. రెండోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి 'పుష్కర్ సింగ్ దామి' ఈ బిల్లు అమలు సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు సుప్రీం కోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి రంజనా పి.దేశాయ్ నేతృత్వంలో ఒక కమిటీని నియమించారు. ఈ కమిటీ రెండేళ్ళు పాటు కసరత్తు చేసింది. సంబంధిత వర్గాలతో అనేక సార్లు చర్చల తర్వాత ఆ కమిటీ తన సిఫారసులను ప్రభుత్వానికి అందజేసింది. ఈ సిఫారసుల్లో కుల, మతాలతో నిమిత్తం లేకుండా మహిళలందరికీ ఒకే తరహా చట్టాలు వర్తిస్తాయి. ఆస్తి, వారసత్వ చట్టాల్లో కూడా సమానత్వ హక్కు ఉంటుంది. లోక్‌సభ ఎన్నికల ముందు ఉత్తరాఖండ్‌లో బిజెపి ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకుని రావడం తో తమ పార్టీ కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వస్తే, దేశమంతటా ఇలాంటి చట్టాన్ని తీసుకు వస్తామని ఎన్నికల ప్రచారంలో బిజెపి నాయకులు ప్రజలకు వాగ్దానం చేయాలని నిర్ణయించుకున్నారు. రాజ్యసభలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రసంగంలో తమ పార్టీకి దరిదాపుల్లోకి కూడా కాంగ్రెస్ చేరుకోలేదు అనే భరోసాతో ఉన్నారు. అందుకు తగినట్లుగానే 'ఇండియా' కూటమి కూడా బలహీనపడుతుంది. వారిలో ఐక్యత లోపించింది. ప్రజా సమస్యలపై 'కామన్ ఎజెండా'ను ఇంకా రూపొందించుకోలేదు. కీలక నేతలు యుద్ధానికి ముందే రణక్షేత్రం నుండి తప్పుకుంటున్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలన్నింటి లో లోక్ సభ ఎన్నికల లోపు ఈ చట్టాన్ని తీసుకుని వచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ చట్టాన్ని తీసుకుని వచ్చేందుకు కమలనాథలు ఉత్సాహాతో ముందుకు సాగుతున్నారు. దేశంలో అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు, హక్కులు కల్పించటమే ఈ చట్టం యొక్క ముఖ్య ఉద్దేశం. ఇతర రాష్ట్రాలు కూడా ఈ చట్టాన్ని తెచ్చేందుకు ఆసక్తి చూపుతున్నాయి.

# తెలంగాణలో మళ్లీ తెరపైకి పొత్తులు

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :**

తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ పొత్తులు పెట్టుకుంటాయని గత వారం రోజులుగా ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ప్రచారాన్ని కిషన్ రెడ్డి నిర్మోహమాటంగా ఖండించారు. కేసీఆర్‌ను కల్వకుంట్ల కరప్షన్‌రావుగా అభివర్ణిస్తూ వీడియో రిలీజ్ చేశారు. తెలంగాణలో17 పార్లమెంట్ సీట్లను గెల్చుకుంటామని తెలంగాణ బీజేపీ నేతలు ధీమాగా చెబుతున్నారు. అయితే ఈ ప్రచారంపై ఇంత వరకూ బీఆర్ఎస్ ఎలాంటి స్పందనా వ్యక్తం చేయలేదు. పొత్తుల కోసం బీఆర్ఎస్ గట్టి ప్రయత్నాలు చేసిందని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. బీజేపీ హైకమాండ్‌కు ప్రతిపాదనలు వెళ్లాయని ఆ ప్రతిపాదనలపై అంతర్గత చర్చ కూడా జరిగిందని చెబుతున్నారు. కానీ రాష్ట్ర ముఖ్య నేతల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వచ్చిందని చెబుతున్నారు. తెలంగాణలో పొత్తులంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన అలాంటి ఆశలు పెట్టుకోవద్దని నేరుగా చెప్పినట్లయింది. పొత్తుల ప్రచారం ప్రారంభమైన తర్వాత మొదట బండి సంజయ్ ఘాటుగా స్పందించారు. మెడ మీద తలకాయ ఉన్న వారెవరూ బీఆర్ఎస్ తో పొత్తులు పెట్టుకోరని వారించారు. అయితే మాజీ మంత్రి మల్లారెడ్డి మాత్రం.. బీజేపీతో పొత్తులంటాయన్నట్లుగా కామెంట్లు చేయడంతో.. కిషన్ రెడ్డి స్పందించక తప్పలేదు. బీజేపీతో పొత్తుల విషయంలో మల్లారెడ్డి చేసిన వ్యాఖ్యలతో అనేక రకాల ప్రచారాలు ప్రారంభమైనా బీఆర్ఎస్ హైకమాండ్ మాత్రం ఎలాంటి స్పందనా వ్యక్తం చేయలేదు. ఎవరూ స్పందించలేదు. పొత్తులపై అసలు మాట్లాడవద్దని నేతలను అతర్గతంగా





ఆదేశించినట్లుగా తెలుస్తోంది. అయితే స్వయంగా కిషన్ రెడ్డి కూడా ఖండించడంతో పాటు కేసీఆర్ పై ఆరోపణలు చేయడంతో.. బీఆర్ఎస్ గట్టిగా రివర్స్ కౌంటర్ ఇస్తుందని అనుకున్నారు. కానీ ఆ పార్టీ నేతలు పెద్దగా స్పందించడానికి ఆసక్తి చూపించడం లేదు. బీజేపీపై విమర్శలు చేయకూడదన్న విధాన నిర్ణయం తీసుకుని ఉంటారన్న అభిప్రాయం వినిపిస్తోంది. పొత్తులపై బీజేపీ క్లారిటీ ఇచ్చేయడంతో వచ్చే లోక్ సభ ఎన్నికల్లో ముక్కోణపు పోటీ జరుగుతుందని అనుకోవచ్చు. ఇప్పటికే లోక్ సభ ఎన్నికలు జాతీయ పార్టీల మధ్య పోరుగా ప్రజల్లోకి వెళ్తోంది. వచ్చే నెల రోజుల్లో ఇలాంటి మూమెంట్ పెరిగితే బీఆర్ఎస్ తీవ్రంగా నష్టపోతుందన్న అభిప్రాయం వినిపిస్తోంది. నిజానికి బీఆర్ఎస్, బీజేపీ పొత్తులు పెట్టుకుంటే.. కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందికరమని అంచనాలు ఉన్నాయి. బీఆర్ఎస్ కూడా బీజేపీతో కలిసి మెజార్టీ లోక్ సభ సీట్లు గెల్చుకుని ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలగొట్టాలన్న ప్రణాళిక - వేసుకుందని కూడా చెప్పుకున్నారు. అలాంటిదేమీ లేదని బీఆర్ఎస్ తో పొత్తుల ఆలోచన అసలు చేయడం లేదని బీజేపీ క్లారిటీ ఇవ్వడంతో స్పష్టత వచ్చింది. అయితే రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో అంచనా వేయలేం. బీఆర్ఎస్ పొత్తు ఆలోచనలపై ఎలాంటి ప్రకటనలు చేయకపోవడంతో కథ ఇంకా ఉందని అనుకోవచ్చు.

# నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

మనిషి జీవితంలో మొదట నేర్చుకునే భాష మాతృభాష. తల్లి ఒడే బిడ్డకు తొలి బడి. తన తల్లిని ఎవరూ చెప్పకుండానే అమ్మా అని బిడ్డ ఎలా పిలుస్తాడో.. మాతృభాష కూడా అంతే. మాతృభాష సహజంగా అబ్బుతుంది. అప్రయత్నంగా వస్తుంది. అమ్మ మాటే మాతృభాష. అందుకే ప్రతి బిడ్డ అమ్మను కాపాడుకున్నట్టే మాతృభాషను కూడా కాపాడుకోవాలి. మనుగడ కోసం ఇతర భాషలను నేర్చుకోవడంలో తప్పులేదు. అయితే వాటి ప్రభావం మాతృభాషపై పడకుండా చూసుకోవాలి. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21 న ప్రపంచవ్యాప్తంగా నిర్వహించాలని 1999 నవంబరు 17న యునెస్కో ప్రకటించింది. 2000 సంవత్సరం నుంచి ప్రతి ఏటా మాతృభాషా పరిరక్షణ కార్యక్రమాన్ని యునెస్కో డైరెక్టర్ జనరల్ ప్రకటిస్తూ వస్తున్నారు. ప్రపంచంలో చిన్న, పెద్ద భాషలన్నిటినీ రక్షించుకోవాలని, భాషా సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారానే మనం జీవ వైవిధ్యాన్ని కాపాడుకోగలమని యునెస్కో చెబుతోంది. యునెస్కో 1999 ఫిబ్రవరి 21 న అంతర్జాతీయ మాతృభాష దినంగా ప్రకటించింది. 2000 ఫిబ్రవరి 21 నుండి ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నారు. బంగ్లాదేశీయులు (అప్పటి తూర్పు పాకిస్తానీయులు ) చేసిన భాషా ఉద్యమానికి నివాళిగా ప్రతి ఏట ఈ అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని జరుపుకుంటున్నాము. 1947 లో భారత దేశం, పాకిస్తాన్ విభజన జరిగినప్పుడు పాకిస్తాన్ రెండు భౌగోళికంగా వేర్వేరు భాగాలు




ఏర్పడింది. ఒకటి తూర్పు పాకిస్తాన్ (ప్రస్తుతం బంగ్లాదేశ్ అని పిలుస్తారు) రెండవది పశ్చిమ పాకిస్తాన్ (ప్రస్తుతం పాకిస్తాన్ అని పిలుస్తారు). సంస్కృతి, భాష మొదలైన వాటిలో రెండు ఒకదానికొకటి చాలా భిన్నంగా ఉండేవి. ఈ రెండు భాగాలను భారతదేశం వేరు చేసింది. తూర్పు పాకిస్తాన్ (ఇప్పుడు బంగ్లాదేశ్), పశ్చిమ పాకిస్తాన్ (ఇప్పుడు పాకిస్తాన్ ) కలిపి మెజారిటీ ప్రజలు బెంగాలీ లేదా బంగ్లా భాష ఎక్కువగా మాట్లాడేవారు. 1948 లో అప్పటి పాకిస్తాన్ ప్రభుత్వం ఉర్దూను పాకిస్తాన్ జాతీయ భాషగా ప్రకటించింది. దీనికి తూర్పు పాకిస్తాన్ ప్రజలు అభ్యంతరం తెలిపారు. తూర్పు పాకిస్తాన్ జనాభాలో ఎక్కువ భాగం బెంగాలీ మాట్లాడతారు. ఉర్దూతో పాటు బెంగాలీ కూడా జాతీయ భాషలలో ఒకటిగా ఉండాలని వారు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌ను తూర్పు పాకిస్థాన్‌కు చెందిన ధీరేంద్రనాథ్ దత్తా 1948 ఫిబ్రవరి 23 న పాకిస్తాన్ రాజ్యాంగ సభలో లేవనెత్తారు. తూర్పు పాకిస్తాన్ ప్రజలు (ప్రస్తుతం బంగ్లాదేశ్) నిరసనలు చేపట్టారు. భాష సమాన హోదా కోసం ఉద్యమం చేపట్టారు. ఈ ఉద్యమాన్ని అణచివేయడానికి పాకిస్థాన్ ప్రభుత్వం 144 సెక్షన్, ర్యాలీలు, మొదలైనవి ఢాకా నగరంలో నిషేధించింది. ఢాకా విశ్వవిద్యాలయం విద్యార్థులు, సాధారణ ప్రజల సహకారంతో భారీ ర్యాలీలు, సమావేశాలు ఏర్పాటు చేశారు. 1952 ఫిబ్రవరి 21 న ర్యాలీలో పాల్గొన్న వారిపై పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో సలాం, బర్కాట్, రఫీక్, జబ్బర్, షఫియూర్ మరణించారు. వందలాది మంది గాయపడ్డారు. చరిత్రలో ఇది చాలా అరుదైన సంఘటన, ప్రజలు తమ మాతృభాష కోసం ప్రాణాలను అర్పించారు. పోలీసుల దాడికి నిరసనగా ముస్లిం లీగ్ అదే రోజు పార్లమెంటరీ పార్టీకి రాజీనామా చేశారు. ఉద్యమం పెరుగుతున్న నేపథ్యంలో, పాకిస్తాన్ కేంద్ర ప్రభుత్వం చివరకు దిగి వచ్చింది. 1954 మే 8 న పాకిస్తాన్ రాజ్యాంగ సభలో బెంగాలీని రాష్ట్ర భాషలలో ఒకటిగా స్వీకరించారు. 1956 లో పాకిస్తాన్ మొదటి రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు, ఆర్టికల్ 214 లో బెంగాలీ ఉర్దూలను పాకిస్తాన్ రాష్ట్ర భాషలుగా పేర్కొంది. 1971 లో బంగ్లాదేశ్ స్వతంత్రమైనప్పుడు, బెంగాలీ ఏకైక రాష్ట్ర భాషగా ప్రవేశపెట్టబడింది. యునెస్కో బంగ్లా భాషా ఉద్యమం, మానవ భాష సాంస్కృతిక హక్కులను పుర-స్కరించుకుని 1999 ఫిబ్రవరి 21, న అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం ప్రకటించింది.



# నిత్య పెళ్లి కొడుకు అరెస్ట్...

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :**

హైదరాబాద్ లో నిత్య పెళ్లి కొడుకు ఆగడాలు వెలుగు చూశాయి. భార్య బతికి వుండగానే చనిపోయిందని అమరేందర్ అనే వ్యక్తి మరో పెళ్లి చేసుకున్నాడు. ఈయన హై కోర్ట్ లో న్యాయవాదిగా చలామణి అవుతున్నట్లుగా పోలీసులు గుర్తించారు. తన భార్యకు పదే పదే ఆడపిల్లలే పుడుతున్నారని ఆమెకు ఏకంగా నాలుగు సార్లు అబార్షన్ చేయించినట్లుగా పోలీసులు తెలిపారు. వారికి ఇప్పటికే ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు నేరం అయినప్పటికీ ఇల్లీగల్ గా స్కానింగ్ చేసి ఆడపిల్ల పుడుతుందని తెలియగానే అమరేందర్ 4 సార్లు అబార్షన్ చేయించినట్లుగా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భార్య బతికి ఉన్నా చనిపోయిందని వేరే పెళ్లి చేసుకున్నాడు. అంతేకాక ఇతను రాజకీయాల్లోనూ జోక్యం ఉంది. టీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్ పార్టీగా మారిన తర్వాత తెలంగాణ రైతు రాజ్య సమితి అనే ఒక పార్టీని అమరేందర్ రిజిస్టర్ చేయించుకున్నాడు. అమరేందర్ తండ్రి రిటైర్డ్ మెజిస్ట్రేట్ అంటూ పలువురిని మోసం చేస్తున్నారని బాధితురాలు కూడా ఆరోపిస్తోంది. ఇప్పటికే సరూర్ నగర్ ఉమెన్ పీఎస్ లో అమరేందర్ పై కేసు నమోదు అయింది. అమరేందర్ బారిన పడ్డ పలువురు బాధితులు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని బాధితురాలైన అమరేందర్ భార్య వేడుకుంటున్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215